క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పెదకాకాని: మండలంలోని పలు సాయిబాబా మందిరాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెనిగండ్ల శివారు అగతవరప్పాడు రోడ్డులో ఉన్న మందిరంలో అర్చకుడు కూరపాటి శివప్రసాద్ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోత్ర నామ పూజల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అందజేశారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



సుమశ్రీ



పఠాన్ షాహెదా

వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వాలీబాల్ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బాలికల అండర్-16 విభాగానికి ఎంపికైనట్లు పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక జరిగినట్లు చెప్పారు. ఇందులో మట్టుపల్లి సుమశ్రీ, పఠాన్ షాహెదాలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇద్దరూ ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థినులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ వెంకటేశ్వరరావును హెచ్ఎం టి. విజయశ్రీ అభినందించారు.

నెరవేరనున్న పేదవాడి సొంతింటి కల

పెదకాకాని మండలంలో 1991 మందికి ఇళ్ల పట్టాలు

పెదకాకాని: రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పేదవారికి ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే అధికారులు స్థలాల లేఅవుట్లను కూడా సిద్ధం చేశారు. కార్యక్రమానికి మండలం నుంచి పెద్దఎత్తున లబ్ధిదారులు, నాయకులు తరలి వెళ్లేందుకు సిద్ధం అయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 1991 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పి. రత్నం తెలిపారు.

నేడు వెంకటకృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

పెదకాకాని: మండలంలోని వెంకటకృష్ణాపురంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొంటారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా జన్మదినం పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని 50వ డివిజన్ మల్లికార్జునపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నగర లీగల్ సెల్ చైర్మన్, న్యాయవాది అమృతలూరి రవికిరణ్ ఆధ్వర్యంలో వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ముస్తఫా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సమతుల్యంగా సంక్షేమాన్ని దరి చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కే దక్కుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రమంటే అక్షర క్రమంలోనే కాకుండా, అభివృద్ధిలో ముందంజలో ఉండేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కచ్చితంగా రానున్న రోజుల్లో సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పరిపాలనను ప్రజల ఇంటి వద్దకు చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు అడపా శేషు, మందపాటి శేషగిరిరావు, ముంతాజ్ బేగం, వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో గౌస్ మొహిద్దీన్, మురళీ, ప్రవీణ్, రాజు, రత్నం, రాణి, బత్తుల జ్యోతి, కరుణమ్మ, సరళ, ఈశ్వరమ్మ, రత్నకుమారి, మరియమ్మ ఉన్నారు.

కాసులు కురిపిస్తున్న పైప్‌లైన్ లీకులు

- మరమ్మతుల పేరిట ప్రజాధనం దండుకుంటున్న అధికారులు
- సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద తరచూ పైప్‌లైన్‌కు భారీగా లీకులు
- మరమ్మతులు చేస్తున్నా ఫలితం సున్నా



సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్‌కు మరమ్మతులు

నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేటు సమీపంలో తాగునీటి పైపులైన్‌కు తరచూ లీకులు పడటం పరిపాటిగా మారింది. ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టడం, బిల్లులు పెట్టుకోవడం, తిరిగి మళ్లీ లీకులు ఏర్పడటం షరా మామూలుగా మారింది. తాజాగా రెండు పెద్ద లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోందని ఇంజినీరింగ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో బుధవారం ఉదయం పంపింగ్ అయిన తర్వాత మరమ్మతులు చేపట్టారు. అయితే, పంపింగ్ సమయంలో ఒత్తిడి పెరగడంతో మరలా లీకులు ఏర్పడ్డాయి. తొలుత బుధవారం సాయంత్రానికి పూర్తి చేస్తామని చెప్పిన ఇంజినీరింగ్ అధికారులు గురువారం అర్ధరాత్రికి పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు చెప్పారు. దీనివల్ల పశ్చిమ నియోజకవర్గానికి పంపింగ్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేవని, నీరు సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

సంజీవయ్యనగర్ మీదుగా హెచ్‌ఎల్‌ఆర్‌కు 900 డయా పైపులైన్

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్(లక్ష్మీపురం)కు గతంలో 800 ఎం.ఎం. డయా పైపులైను మీద తాగునీటి సరఫరా జరిగేది. అయితే, అతి పాడబడి పోవడంతో తరుచూ లీకులు పడతుండేవి. ఇంజినీరింగ్ అధికారులు ప్రతిసారి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి లీకులకు మరమ్మతులు చేయడం...పంపింగ్ జరిగే సమయంలో నీటి ఒత్తిడి పెరిగి మరలా సమస్య పునరావృతం కావడం పరిపాటిగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారంగా రెండేళ్ల కిందట ప్రస్తుతం ఉన్న 800 ఎం.ఎం. డయా పైపులైన్ కాకుండా వేరే ప్రాంతాల మీదుగా 900 ఎం.ఎం. డయా పైపులైన్(సంజీవయ్యనగర్, వసంతరాయపురం ట్యాంకులు, జానీ కాలనీ, శ్రీ హస్పిటల్, డొంకరోడ్డు మెయిన్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డు క్రాస్ చేసుకుంటూ హెచ్‌ఎల్‌ఆర్‌కు) వేశారు. దీనికి ఇంజినీరింగ్ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో అనుసంధాన పనులు పూర్తి చేశారు.

ట్రాక్ కింద నుంచి వేయకపోవడంతో సమస్య

సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ప్రతిసారి పైపులైన్‌పై లీకులు ఏర్పడి రోజుకు లక్షలాది లీటర్లు మురుగుపాలైవుతూ ఉండేది. అయితే, దీనికి పరిష్కారానికి గాను 2019లో రైల్వే ట్రాక్ కింద నుంచి హెచ్‌ఎల్‌ఆర్ వరకు 800 ఎం.ఎం. డయా పైపులైన్ స్థానంలో 900 ఎం.ఎం. డయా పైపులైన్ పనుల్ని కోట్ల రూపాయిలతో టెండర్ దక్కించుకుని కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి, రెండేళ్ల కిందట పూర్తి చేశారు. అయితే, అప్పటి ఇంజినీరింగ్ అధికారులు రైల్వే ట్రాక్ కింద నుంచి వేయాలంటే కష్టమని భావించి, గేటు దాటిన తరువాత నుంచి పనులు చేపట్టి ట్రాక్ కింద పైపులైన్ వేయకుండా వదిలేశారు. అప్పుడే పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు ఇంతలా ప్రజాధనం వృథా కాకుండా ఉండేది. ఇప్పుడు ట్రాక్ కింద ఉన్న 800 ఎం.ఎం. డయా పైపులైన్ సమస్యగా మారింది. దీనికి తరచూ లీకులు పడి నీరంతా వృథా అవుతోంది.

సమన్వయం లేకపోవడంతోనే సమస్య

మంచినీటి సరఫరా విషయంలో ఇంజినీరింగ్ అధికారులు పొరపాట్లు చేస్తూనే ఉన్నారు.ఫిబ్రవరిలో నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు వాటర్ సరఫరా చేసేందుకు 800 నుంచి 900 డయా పైపులైన్ అనుసంధాన పనులు చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు అవగాహనరాహిత్యంతో దాదాపు 20 రోజులు దాకా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పశ్చిమ నియోజకవర్గానికి తీవ్రస్థాయిలో నీటి ఎద్దటి ఏర్పడింది. తూర్పు, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇలాంటి సమస్యలు ప్రతిసారి పునరావృతం అవుతూనే ఉన్నాయి.

ప్రజాధనం దోచుకునేందుకే....

తరుచుగా లీకులు ఏర్పడుతున్నప్పటికీ దీనికి శాశ్వత పరిష్కారం చూపకుండా ఇంజినీరింగ్ అధికారులు పాత పైపులైన్‌కు మరమ్మతుల పేరిట ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారు. కొంత మంది ఇంజినీరింగ్ అధికారులే బినామీ కాంట్రాక్టర్లతో పనులు చేయించుకుంటూ లక్షలాది రూపాయిలను తమ జేబుల్లో నింపుకుంటున్నారని నగరపాలక సంస్థ వర్గాల్లో బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నూతన పైపులైన్‌కు అనుమతులు మంజూరు

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వరకు నూతన పైపులైన్ వేసేందుకు అనుమతులు మంజూరయ్యాయి. వేసవి దృష్ట్యా పశ్చిమ నియోజకవర్గానికి నీటి ఎద్దడి లేకుండా పాత పైపులైన్‌పై ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేస్తున్నాం. త్వరలో 290 మీటర్ల పొడువున నూతన పైపులైన్ నెహ్రూనగర్ నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకు వేయనున్నట్లు చెప్పారు.

– కోటేశ్వరరావు (ఈఈ), అనూష (ఏఈ), నగరపాలక సంస్థ

ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ హెనాప్రియ



తెనాలిరూరల్: తెనాలి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సిద్దెల హెనాప్రియ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.రవిబాబు జూన్ 14 వరకు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లారు. దీంతో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న హెనాప్రియకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ..అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా చైతన్యం ‘ఇప్టా’ ఆశయం

ఆవిర్భావ సభలో బొల్లిముంత కృష్ణ

తెనాలి: ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా) ఆవిర్భావ సమావేశాన్ని గురువారం సాయంత్రం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. విజ్ఞానం కోసం, ప్రజా చైతన్యం కోసం అనే లక్ష్యంతో ఇప్టా ఆవిర్భవించినట్టు గుర్తుచేశారు. ఆవిర్భావం నుంచి నేటి వరకు నాటక, నాటిక, పాటలు, జానపద కళా రూపాలతో ప్రజా చైతన్యం కోసం కృషిచేస్తోందని చెప్పారు. కేఏ అబ్బాస్, పృథ్వీరాజ్ కపూర్, కేపీ ఆజ్మీ, బలరాజ్ సహానీ, సలీల్ చౌదరి వంటి ప్రముఖులు జీవితాంతం ఇప్టా కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసినట్టు తెలిపారు. మహానటి షబనా ఆజ్మీ ఇప్పటికీ తన కృషిని కొనసాగిస్తున్నట్టు గుర్తుచేశారు. సంస్థ తెనాలి అధ్యక్షుడు బెల్లంకొండ వెంకట్ అధ్యక్షత వహించారు.

వలంటీర్ల సేవలు భేష్

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో కార్పొరేటర్ వెంకటరమణాదేవి తదితరులు

పెదనందిపాడు: ప్రజలకు నిస్వార్థంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, దేశంలో రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. పెదనందిపాడులో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన వలంటీర్ల సన్మాన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. వారి సేవల్ని మెచ్చిన ప్రభుత్వం, ప్రతి సంవత్సరం పురస్కారాల్ని కూడా అందిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. గతంలో పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ప్రస్తుతం అటువంటి అవసరం లేదన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తున్నారని చెప్పారు. పెదనందిపాడు మండలంలో 202 మందికి అవార్డులు వచ్చాయని, అందులో సేవామిత్ర 195 మందికి, సేవారత్న ఐదుగురికి, సేవా వజ్ర ఇద్దరికి వచ్చినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ హెప్సిబా, వైస్ ఎంపీపీలు ఖాసింబీ, సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఖాసీంపీరా, సర్పంచ్ దాసరి పద్మారావు, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఇంచార్జి ఎంపీడీవో సాయి లీల, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్‌లో..

అంకిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలో వలంటీర్లను గురువారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి మాట్లాడుతూ జగనన్న సైనికుల మాదిరి వలంటీర్లు విధులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావడంలో వారి పాత్ర ముఖ్యమైందని చెప్పారు. వలంటీర్లంతా ఇదే సేవా నిరతితో పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థకు మంచి ఆదరణ లభించిందని తెలిపారు. అనంతరం 21 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



నగరంపాలెం: ఎన్టీఆర్ సినిమా రంగంతో పాటు రాజకీయాల్లో విలక్షణ వ్యక్తిగా రాణించి, కోట్లాది తెలుగు ప్రజల హృదయాల్లో ఆరాధ్య దైవం అయ్యారని భారతీయత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు బ్రాడీపేట అపెక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్‌లో జరిగాయి. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ సాంఘిక, పౌరాణిక, జానపద నటుడిగా ఎన్టీఆర్ తనకు తానే సాటి అనిపించుకున్నారని తెలిపారు. రాజకీయ రంగంలో తెలుగు వారి ఆత్మాభిమానాన్ని దశ దిశలా చాటారని పేర్కొన్నారు. మహిళల పక్షపాతిగా ఉంటూ వారి ఉన్నత విద్యల కోసం పద్మావతి మహిళా విశ్వ విద్యాలయాన్ని స్థాపించారని తెలిపారు. పేద ప్రజలకు రూపాయికి కిలో బియ్యం, పక్కా గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీరామారావుకి దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం ‘ఎన్టీఆర్ శత జయంతి గీతం సీడీ’ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపెక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, వల్లూరి అనిల్, జాగు పద్మనాభం పాల్గొన్నారు. చివరగా ప్రజా గాయకుడు పి.వి.రమణ పాటలు ఆలపించారు.

యువతకు చేరువలో ఎన్ఐఎఫ్ఎస్

నెహ్రూనగర్: యువతకు విద్యతో పాటు ఉపాధి కల్పనే ధ్యేయంగా ఎన్ఐఎఫ్ఎస్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ) పని చేస్తోందని సంస్థ అధినేత సునీల్ మహంతి పేర్కొన్నారు. మాయాబజార్‌లోని కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఐఎస్ఎస్ ట్రైనింగ్ సెంటర్‌ను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంటు ఆఫ్ కార్పొరేషన్ , స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, నాగార్జున యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ అనుబంధంగా వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు విద్యతోపాటు ఉపాధి కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

కళాకారిణి రత్నరాణికి సత్కారం

తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటరులో గురువారం గజదొంగ సినిమాను ప్రదర్శించారు. ప్రముఖ కళాకారిణి, గాయని, పద రచయిత్రి మోదుకూరు రత్నరాణిని థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మేయర్ కావటి



సచివాలయంలో కార్యదర్శులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

గుంటూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డు సచివాలయ కార్యదర్శులు పని చేయాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. ఆయన గురువారం 16వ డివిజన్ బుడంపాడులోని 195 వార్డు సచివాలయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యదర్శులంతా తమ విభాగ స్థానిక సమస్యల్ని గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారం, జవాబుదారీతనంపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వలంటీర్లు వారంలో మూడు రోజులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని అడ్మిన్ కార్యదర్శిని ఆదేశించారు.

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

అమృత్ పథకంలో భాగంగా రూ. 4.50 కోట్లతో డివిజన్ పరిధిలోని బుడంపాడు చెరువు ఆధునీకరణ పనుల్ని మేయర్ పరిశీలించారు. చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల్ని కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, ఈఈ కొండారెడ్డి, డీఈఈ కళ్యాణ్‌రావు, ఏఈ రవికిరణ్, బోరుగడ్డ రజనీకాంత్, ఆంజనేయులు, సుబ్బారావు, హుస్సేన్, స్థానిక సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపుల వర్షంతో బీభత్సం

- విరిగి పడిన కరెంటు స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



పెదకాకాని మండలంలో వీచిన గాలులకు విరిగిన కరెంటు స్తంభం

పెదకాకాని: మండలంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఈదురు గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి కరెంటు స్తంభాలు విరిగిపోవడం, కరెంటు తీగలపై చెట్లు పడటంతో గురువారం రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బలమైన గాలులకు నంబూరు విజయభాస్కర్‌నగర్‌లో విద్యుత్ స్తంభం విరిగి పడింది. కరెంటు వైర్లు నేల వాలాయి. అనుమర్లపూడిలో కరెంటు తీగలపై తాడిచెట్టు పడటం, వెనిగండ్లలో చెట్ల కొమ్మలు తీగలపై పడి తెగిపోవడం, పెదకాకానిలో రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీ కరెంటు తీగలపై పడటం వంటి సంఘటనల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఏఈ బి. శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది రంగంలోకి దిగి లైన్లకు మరమ్మతులు చేపట్టారు. చెట్ల కొమ్మలు తొలగించిన అనంతరం రాత్రి 7:30 గంటలకు కరెంటు సరఫరాను పునరుద్ధరించారు.

హోమియోలో తక్కువ ఖర్చుతో పశు వైద్యం



హోమియోపతి వైద్య పరీక్షల గురించి వివరిస్తున్న పశువైద్య నిపుణుడు శాస్త్రి

గుంటూరు రూరల్: పశువుల్లో తక్కువ ఖర్చుతో హోమియోపతి చికిత్స ద్వారా మంచి ఫలితాల్ని పొందవచ్చని పశువైద్య నిపుణుడు వి.వి.ఆర్.కె. శాస్త్రి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో గురువారం రైతులకు పాడి పరిశ్రమపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎక్కువ ఖర్చులు అవ్వడం వల్ల రైతులకు పశు పోషణ గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. హోమియో చికిత్స విధానంలో తక్కువ ఖర్చులతో రోగాల బారినుంచి వాటిని కాపాడవచ్చని చెప్పారు. మనిషి లాగా మూగ జీవాలు తమ ఇబ్బందుల్ని నోటితో చెప్పలేవు గనుక వాటి పరిస్థితుల్ని గమనిస్తూ సరైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య నిపుణులు శర్మ, శివరాం, శివసాగర్‌రెడ్డి, రైతునేస్తం ఫౌండేషన్ మేనేజరు ప్రసాదరావు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇంటిలోకి దూసుకెళ్లిన కారు

నలుగురికి స్వల్ప గాయాలు



పెదకాకాని: అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని అనంతరం రేకుల షెడ్డులోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మండలంలోని తక్కెళ్లపాడు అడ్డరోడ్డులో నందివెలుగు వెళ్లే రోడ్డు పక్కనే కొందరు నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గుంటూరు వైపు నుంచి తెల్లవారుజామున వేగంగా దూసుకు వచ్చిన కారు తొలుత రోడ్డు పక్కనున్న వేప చెట్టును బలంగా ఢీకొని, తర్వాత రేకుల షెడ్డును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ఢీ కొనడంతో గోడ కూలి ఇంటిలో నిద్రిస్తున్న సయ్యద్ నాగూర్‌బీ కుమారుడు ఇమాంసా తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడ్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు మద్యం తాగి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంపై పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులకు వాహనాల పంపిణీ



వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి

పట్నంబజారు: బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందన్నారు. ఒక్కో మోటారు సైకిల్ రూ. 1.20 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నేతలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ గడువు పొడిగింపు

మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో జారీ

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ మెట్టు రాజేశ్వరి తెలిపారు. నల్లపాడులోని నివాసం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీని యథాతథంగా మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం జీవోను జారీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా రూ 3.30 కోట్ల వరకూ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన కార్యక్రమాల్ని చేపట్టడంలో ముందుంటున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేస్తూ వారికి చేదోడువాదోడుగా ఉంటున్నట్లు చెప్పారు.

షాపింగ్ మాల్‌లో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపింగ్ మాల్‌లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. హిందూ కళాశాల వెనుక రోడ్డులోని కొత్తమాసు కలెక్షన్ షాపింగ్ మాల్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి భవనం పై రేకులు తొలగించి లోపలకు ప్రవేశించాడు. లాకర్ పగులగొట్టి అందులోని రూ. 50వేలు చోరీ చేశాడు. షాపింగ్ మాల్ ప్రతినిధి వెంకట ఆదిత్య ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4న ఎస్పీ బాలు జయంతి వేడుకలు



పాత గుంటూరు: కళా దర్బార్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 4న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ 4న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఎనిమిది మందికి బాలు జీవిత సాఫల్య పురస్కారాల్ని అందించి సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ బాలు పాటలతో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డి.బి. బాలస్వామి, బి.చంద్రబాబు, బి. రాజశేఖర్, కె. బాబూరావు, చింతా రజని, షేక్ సత్తార్ పాల్గొన్నారు.